క్లుప్తంగా

విద్యుత్ బల్బుల ఏర్పాటు



కోసిగి: మండల పరిధిలోని ఐరన్‌గల్లు గ్రామంలో కార్తీక మాసం శ్రీ ఆంజనేయ స్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని మరమ్మతులకు గురైన విద్యుత్ బల్బుల స్థానంలో కొత్త బల్బులు ఏర్పాటు చేయించినట్లు గ్రామ సర్పంచ్ రామాంజినేయులు తెలిపారు. ఆదివారం గ్రామంలో పర్యటించి మరమ్మతులకు గురైన స్తంభాలను గుర్తించి దగ్గరుండి విద్యుత్ దీపాలను మార్చారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

కవి గద్వాల సోమన్నకు సన్మానం



గద్వాల సోమన్నను సన్మానిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబదహాళ్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడిగా పనిచేస్తున్న బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్నను లేపాక్షి ఫౌండేషన్ అనంత కవితోత్సవం, జాతీయ శతాధిక కవి సమ్మేళనం సందర్భంగా అనంతపురంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన స్వగతాలు, కాంతి కిరణాలు పుస్తకాలను అనంతపురం శాసన సభ్యులు దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, సాహితీమిత్రులు పొట్లూరి హరికృష్ణ చేతుల మీదుగా అవిష్కరించి కవులు, పాఠకుల సమక్షంలో పరిచయం చేశారు. గద్వాల సోమన్న రచించిన 50పుస్తకాలను గంథాలయానికి ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కవులు, కళాకారులు తెలుగు వెలుగు అధ్యక్షుడు టీవీ రెడ్డి, ఏఎస్ఐ భాస్కర రావు, ఎస్కే యూనివర్సిటీ, విశ్రాంతి సూపరింటెండెంట్ పోకూరి చంద్రశేఖర్, లీలామనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ అధికారికి ఉత్తమ పురస్కారం



అవార్డు అందుకుంటున్న ఎన్‌సీసీ అధికారి గోవిందు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పని చేస్తున్న లెఫ్టినెంట్ గోవిందు ఉత్తమ ఎన్‌సీసీ అవార్డును అందుకున్నారు. ఆదివారం ఎన్‌సీసీ డే పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఉత్తమ ఎన్‌సీసీ అధికారులకు హైదరబాద్‌లో అవార్డుల ప్రధానం కార్యక్రమం జరిగింది. సీనియర్ డివిజన్ విభాగంలో అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా రెండు రాష్ట్రాల డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వి.ఎం రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

అక్రమ మట్టి తవ్వకాలపై స్పందించని ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నూర్‌అహ్మద్

ఆదోని అర్బన్: ఆదోని నియోజకవర్గంలో అక్రమ గరుసు, మట్టి తవ్వకాలపై ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి నోరు మెదపడంలేదని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి(ఎంహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి నూర్‌అహ్మద్ అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి నాయకుల ఆగడాలను ఎమ్మెల్యే అరికట్టలేకపోతున్నారన్నారు. ఎమ్మెల్యే సన్నిహితుడైన ఓ డాక్టర్ ఇటీవల ఎస్కేడీ కాలనీలో భూ కబ్జా చేశారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఎమ్మెల్యేకు తగిన బుద్ధి చెప్పే రోజులు కూడా దగ్గరలోనే ఉన్నాయన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు



కోసిగి వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ చంద్రమోహన్

కోసిగి: లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని కోసిగి ఎస్ఐ చంద్రమోహన్ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం కోసిగిలోని మౌంట్ కార్మెల్ స్కూల్ సమీపంలో వాహనాలను తనిఖీ చేపట్టారు. వాహనాల పర్మిట్లు, అనుమతులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, అక్రమంగా రవాణాలను పరిశీలించారు. ఇందులో అనుమతులు లేని వాహనాలకు జరిమానా విధించారు.

పంటల బీమాకు మంగళం

- ఉచిత పంటల బీమాపై చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం
- రైతులు ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తింపు
- రైతులకు అండగా నిలిచిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- పైసా ఖర్చు లేకుండా అమలు
- పంట నష్టపోయిన రైతులకు సకాలంలో పరిహారం



వర్షానికి దెబ్బతిన్న వేరుశనగ పంట (ఫైల్)



వర్షానికి దెబ్బతిన్న పత్తి పైరు (ఫైల్)

గోనెగండ్ల : ఎన్నికల ముందు తాము రైతు పక్షపాతులమని డప్పు వాయించుకున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు మొండి చెయ్యి చూపింది. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా ఉచిత పంటల బీమాకు మంగళం పాడింది. వైఎస్సార్‌సీపీ హయంలో రైతులపై పైసా భారం పడకుండా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసింది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం కూడా అందుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ పథకంపై చేతులెత్తేసింది. రైతులే బీమా ప్రీమియం చెల్లించాలంటూ నిబంధన పెట్టింది. బీమా చెల్లించిన వారే లబ్ధి పొందుతారని స్పష్టం చేసింది. కూటమి ప్రభుత్వంలో అప్పులు తప్ప ఆదాయం రావడం లేదని రైతులు వాపోతున్నారు. మరోవైపు 9 గంటల ఉచిత కరెంటు అంటూ విపరీతంగా కోతలు విధిస్తూ రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసినా అన్నదాత సుఖీభవ పథకం ఊసేత్తకపోవడం శోచనీయం.

బీమా ఉంటేనే ధీమా

తుపాను, భారీ వర్షాలు, వరదల వల్ల పంట నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం పరిశీలించి పరిహారం అందుకోవడానికి పంటల బీమా పథకం ఎంతో దోహదపడుతోంది. పంట విలువ అంచనా వేసి బీమా కంపెనీలు రైతులకు నష్టపరిహారం అందిస్తాయి. రైతులు పంటలపై బ్యాంకు రుణాలు తీసుకుంటే బ్యాంకు అధికారులే బీమా ప్రీమియం చెల్లిస్తారు. పంటల బీమా సకాలంలో చెల్లించకపోతే విపత్తు సమయంలో పంటలు నష్టపోయినా నష్ట పరిహారం అందక నష్టపోతారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో..

రైతులపై బీమా ప్రీమియం భారం పడకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయంలో 2019 ఖరీఫ్ సీజన్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. ఈ క్రాప్ చేసుకున్న రైతులందరికీ ప్రీమియం మొత్తాన్ని చెల్లించి ఆదుకుంది. దీని వల్ల రైతులకు బీమా ప్రీమియం చెల్లించే పని లేకుండా పోయింది. విపత్తుల సమయంలో పంట నష్టపోయిన రైతులతో పాటు కౌలు రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందేది. గత ప్రభుత్వం మండల పరిధిలో పంట నష్టపోయిన 15,885 మంది రైతులకు సకాలంలో రూ.18.83కోట్లు వారి ఖాతాలకు పరిహారం చెల్లించి ఆదుకుంది.

డిసెంబర్ 15లోపు ప్రీమియం చెల్లించాలి

మండల పరిధిలో రబీ సీజన్‌లో 6,400 ఎకరాల్లో పప్పు శనగ, మొక్కజొన్న, మినుములు, వేరుశనగ సాగయ్యాయి. బీమా ప్రీమియం చెల్లించడానికి ప్రభుత్వం డిసెంబర్ 15 వరకు గడువు విధించింది. ఈ క్రాప్ చేయించుకున్న రైతులు పంటలకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో పప్పు శనగ, వరి, జొన్న, వేరుశనగ, ఉల్లి పంటలను చేర్చింది.

ప్రభుత్వం నిర్ణయించిన బీమా ప్రీమియం మొత్తం

పంటరకం	బీమా ప్రీమియం మొత్తం ఎకరాకు
టమాట	రూ.1500
వరి	రూ.630
వేరుశనగ	రూ.480
పప్పుశనగ	రూ.420
ఉల్లి	రూ.1350
జొన్న	రూ.297

ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి



రైతులకు పంటల బీమా ప్రభుత్వమే చెల్లించాలి. రబీ సీజన్‌లో పంటల బీమాను కొత్త విధానంలో ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పగించింది. దీని వల్ల రైతులకు భారం తప్ప లాభం లేదు. ప్రీమియం రైతులే చెల్లించాల్సి వస్తోంది.

– మురళీనాయుడు, గోనెగండ్ల

గతంలో పైసా చెల్లించలేదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో ఎన్నడూ పంటల బీమా ప్రీమియం పైసా కూడా చెల్లించలేదు. మా గ్రామంలో ఆర్బీకే సిబ్బంది మా పొలం వద్దకు వచ్చి ఈ క్రాప్ నమోదు చేసుకొని వెళ్లేవారు. ఆ తరువాత ఎటువంటి డబ్బులు మా నుంచి వసూలు చేయలేదు. ప్రభుత్వంలో పంట నష్ట పరిహారం కూడా అందింది.

– వెంకట్రామిరెడ్డి, అలువాల గ్రామం

ప్రీమియం చెల్లిస్తేనే పరిహారం



రైతులు పంటల బీమా చెల్లిస్తేనే నష్టపరిహారం అందుతుంది. వాతావరణ పరిస్థితులు, వరదలు, తుపాన్ల కారణంగా పంటలు నష్టపోయిన రైతులందరికీ నష్ట పరిహారం అందుతుంది. – హేమలత, ఏఓ, గోనెగండ్ల

శ్రీ మఠంలో భక్తుల రద్దీ



శ్రీ మఠం పరిసరాల్లో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో స్వామి మూలబృందావనం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. స్వామి వారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో జయ, దిగ్విజయ, మూల రాముల విగ్రహాలకు, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి, గ్రామ దేవత మంచాలమ్మకు ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను గజ, చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై కొలువుంచి శ్రీ మఠం ప్రాకారంలో అశేషభక్త జన వాహిని మధ్య ఊరేగించారు. రథోత్సవంలో ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ వెంకటేష్‌జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, అసిస్టెంట్ పీఆర్వో వ్యాసరాజాచార్, బిందుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

కొండపై ప్రతిష్ఠాపన పూజలు



ప్రతిష్ఠాపన సందర్భంగా పూజలు చేసిన వినాయక విగ్రహం, కలశాలు



ధ్వజస్తంభానికి, వినాయక విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

ఆదోని అర్బన్: పట్టణశివారులోని రణమండలకొండపై వెలిసిన శ్రీ రణమండల సంతాన ఆంజనేయస్వామి సన్నిధిలో ఆదివారం ప్రతిష్ఠాపన పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకులు, ఆలయ చైర్మన్ టీజీ పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో కార్యక్రమ నిర్వాహకుడు ఏటీఎం శివ సమక్షంలో వేద పండితులు గరుడాద్రి దత్తాత్రేయశర్మ బృందం పూజలు చేశారు. వినాయక విగ్రహం, ధ్వజస్తంభం, గోపురానికి, పాదాలకు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. సోమవారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి గోపురానికి కలశ స్థాపన, విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, పాదాలు ప్రతిష్ఠాపన చేపట్టనున్నారు.

ఘనంగా వాల్మీకి వనభోజన మహోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వాల్మీకులు

ఆదోని అర్బన్: పట్టణంలో వాల్మీకి వనభోజన కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో వాల్మీకి, బోయ కులస్తుల కార్తీకమాస వనభోజన కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక మహేశ్వర కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బి.టి.మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బి.శాంత, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తిక్కన్న, మండల మాజీ అధ్యక్షుడు పంపాపతి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వాల్మీకులంతా ఐక్యమత్యంగా హక్కుల సాధనకై పోరాడాలన్నారు. వాల్మీకుల చిరకాల వాంఛ అయిన ఎస్టీ రిజర్వేషన్ సాధించేందుకు ఎలాంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి వనభోజన కార్యాచరణ సమితి సభ్యులు వెంకన్న, నరసయ్య, దస్తగిరి, రాంభీం నాయుడు, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వైఎస్ హయాంలోనే వీరశైవులకు మేలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న వై రుద్రగౌడ్, లింగాయత్ గురువులు

ఎమ్మిగనూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే వీరశైవ లింగాయత్‌లకు మేలు జరిగిందని, వీరశైవులకు బీసీ–డీగా గుర్తింపునిచ్చి భవిష్యత్తుకు బాటలు వేశారని వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై రుద్రగౌడ్ అన్నారు. ఆదివారం ఎమ్మిగనూరులో వీరశైవుల సంఘటితం, కార్తీక వనమహోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసి వీరశైవుల అభ్యున్నతికి బాటలు వేశారన్నారు. వీరశైవులు ఐక్యమంగా పోరాడి జాతీయ స్థాయిలో ఓబీసీ కోటాను సాధించాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వీరశైవులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మరింత బలపడేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో వీరశైవ గురువులు పాపతిస్వామి, రుద్రముని, శివనాగయ్య, పరమేశమప్ప తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా



దుద్ది గ్రామంలో రోడ్డుపై ప్రవహిస్తున్న తాగునీరు

కోసిగి: మండల పరిధిలోని దుద్ది గ్రామంలో తాగునీరు వృథాగా రోడ్డుపై ప్రవహిస్తోంది. గ్రామానికి సాతనూరు ఎస్ఏపీ స్కీమ్ నుంచి తాగునీరు సరఫరా అవుతుంది. అయితే గ్రామ సచివాలయం వద్ద నీటి స్టోరేజీ సంప్‌ను ఏర్పాటు చేసి రోజు వారిగా కుళాయిలకు సరఫరా చేస్తున్నారు. అయితే సంప్ పూర్తిగా నిండి రోడ్డుపై చేరుతోంది. అలాగే పక్కనే తాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేశారు. ఆ ట్యాంక్‌లు నించి రోజు వృథాగా పారుతున్నాయి. దీంతో వాహనాలతో పాటు పాదచారులు కూడా నడవడానికి వీలులేకుండా తయారైంది. సంబంధిత అధికారులు స్పందించి తాగు నీటి వృథాను అరికట్టి రోడ్ల పైకి నీళ్లు రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ముమ్మరంగా ఓటరు నమోదు కార్యక్రమం

కోసిగి: మండలంలో ఓటరు నమోదు, అభ్యంతరాల ప్రక్రియ ముమ్మరంగా కొనసాగింది. శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు పోలింగ్ బూత్‌లలో బూత్ లెవెల్ ఆఫీసర్స్ ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడ, ఆర్ఐ శ్రీరాములు ప్రతి పోలింగ్ బూత్‌ను సందర్శించి నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. రెండు రోజులలో మండలంలోని 62 పోలింగ్ బూత్‌లలో మొత్తం 17 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇందులో ఫామ్–6 అప్లికేషన్‌లు 15, ఫామ్–7 కింద 0, ఫామ్–8 కింద 2 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. ఇందులో జూనియర్ అసిస్టెంట్ పరుశురాముడు, వీఆర్వోలు, బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని కుప్పగల్ గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి అనే వ్యక్తి అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పెద్దతుంబళం ఎస్ఐ మహేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. తిమ్మారెడ్డి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి, అదుపులోకి తీసుకున్నామన్నారు. సదరు వ్యక్తి వద్ద నుంచి 41 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి



ఎన్‌సీసీడే వేడుకల్లో విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి క్రమ శిక్షణ కలిగిన జీవితం అలవర్చుకోవాలని ఎన్‌సీసీ అధికారి అనిల్ కుమార్ అన్నారు. పట్టణంలోని నెహ్రూ స్మారక పురపాలక ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ డేను నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఎన్‌సీసీలో చేరడం ద్వారా క్రమ శిక్షణ, దేశభక్తి అలవర్చుకుంటారని తెలిపారు. సమాజం పట్ల గౌరవం, బాధ్యత పెరుగుతుందన్నారు. ఎన్‌సీసీ డే సందర్భంగా ఎన్‌సీసీ కేడెట్స్ పాఠశాల నుంచి శ్రీనివాస భవన్ మీదుగా తిమ్మారెడ్డి బస్టాండు వరకు భారత మాతకు జై అంటూ నినాదాలు చేస్తూ సైకిల్ ర్యాలీ చేపట్టారు. అనంతరం బసాపురం సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులోని చెత్త చెదారాన్ని తొలగించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: ఉద్యగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం తగదని ఎస్టీయూ రాష్ట్ర సహ అధ్యక్షుడు సి.నాగరాజు, రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్, జిల్లా అసోసియట్ అధ్యక్షుడు నాగేంద్రప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు అన్నారు. ఆదివారం పురపాలక ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ డివిజన్ వార్షిక కౌన్సిల్ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. 11వ వేతన సవరణ ముగిసి 15 నెలలు గడుస్తున్నా 12వ వేతన సవరణపై చర్చించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతన సవరణ ఆలస్యం జరుగుతుంది కనుక 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్న ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలపై నోరుమెదపడం లేదన్నారు. ఉద్యోగులకు రావాల్సిన పీఆర్‌సీ, డీఏ, పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు వంటివి కలిపి రూ. 30కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు నరసింహులు, లోక్యనాయక్, ప్రహ్లాద్, శ్రీనివాసులు, నాగప్రసాద్, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మిగనూరు బీసీ బాలికల హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

ఎమ్మిగనూరురూరల్: సంక్షేమ వసతి గృహంలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామని రాష్ట్ర జౌళీ, చేనేత, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. పట్టణంలోని బీసీ బాలికల సంక్షేమ వసతి గృహాన్ని ఆదివారం రాత్రి ఆమె సందర్శించారు. వసతి గృహంలోని విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ హాస్టల్‌లో అదనపు గదుల నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి రూ. కోటి మంజూరు చేయిస్తామన్నారు. శిథిలావస్థకు చేరిన వసతి గృహాల్లో మరమ్మతుల కోసం నిధులు కేటాయించామన్నారు. మంత్రి వెంట జిల్లా ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, బీసీ సంక్షేమ అధికారిణి వెంకటలక్ష్మీ, తదితరులు ఉన్నారు. అవినీతికి పాల్పడి సస్పెండ్ అయిన స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కవితకు మళ్లీ పోస్టింగ్ ఇచ్చారని, వెంటనే రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు మంత్రికి వినతి పత్రం అందజేశారు.

త్వరలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ప్రకారం త్వరలో బనవాసి వద్ద టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సవిత చెప్పారు. టెక్స్‌టైల్ పార్కు కోసం కేటాయించిన భూమిని ఆమె పరిశీలించారు. కూటమి ప్రభుత్వం నేతన్నలను ఆదుకుంటుందన్నారు.

26న మహాధర్నాను విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఆదోని రూరల్: అఖిలపక్ష రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు బసాపురం గోపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఆదోని పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను పంచారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు, కార్మిక, వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలన్నారు. హగిరి– వేదావతి నది నుంచి భారీ వర్షాలు వస్తే వర్షపునీరు వృథాగా పోతుందని, ప్రభుత్వం స్పందించి గూళ్యం వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి మొలగవల్లి, నగరడోణ వద్ద రెండు రిజర్వాయర్లు నిర్మించి నీటిని నిల్వ ఉంచాలన్నారు. ఆలూరు నుంచి ఆదోని, కోడుమూరు, కర్నూలు వరకు సాగునీటితో పాటు తాగు నీటిని కూడా అందించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గుడిసె ఈరన్న, భీమన్న, తిమ్మప్ప, వెంకన్న, లింగప్ప, గురునాథ్‌రెడ్డి, నందివాహనరెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరురూరల్: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు తెలిపారు. ఆదివారం స్థానిక సోమప్ప సర్కిల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాకు పెద్ద సంఖ్యలో కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, మధు, కొండారెడ్డి, అమోష్, సోమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బడి సమయం పెంపును ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్

ఆదోని సెంట్రల్: ప్రభుత్వం విడుదల చేసిన పాఠశాలల సమయం పెంపు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం బీటీఏ నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమర్థవంతంగా విద్యాబోధన అందించాలనే అలోచన ప్రభుత్వానికి ఉంటే విద్యా బోధనకు ఆటంకం కలిగించే యాప్‌లను రద్దు చేయాలన్నారు. ఇప్పుడున్న పరిస్థితిలో బడి సమయాన్ని పెంచి విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకోవద్దని సూచించారు. జిల్లాలో విద్యార్థులకు సరైన రవాణ సౌకర్యాలు లేక పోవడంతో ఆటోలు, ట్రాక్టర్లను ఆశ్రయించి ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు గంటలు దాటితే చీకటి పడే అవకాశాలు ఉన్నాయని, విద్యార్థినుల భద్రత ప్రశ్నార్థకంగా మారనుందని తెలిపారు. విద్యారంగ విషయాలపై నిర్ణయాలను తీసుకునేటప్పుడు ఉపాధ్యాయ సంఘాలు, మేధావులతో చర్చిస్తే మంచిదని సూచించారు. చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు జయరాం, చంద్రశేఖర్, కేశన్న తదితరులు పాల్గొన్నారు.



మలుపులో ముప్పు!

మాధవరం సమీపంలోని మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న ముళ్ల పొదలు

మంత్రాలయం: మండల కేంద్రం నుంచి మాధవరం, ఎమ్మిగనూరుకు వెళ్లే జాతీయ రహదారిలో మలుపు వద్ద ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగి ప్రమాదకరంగా మారాయి. ముళ్లపొదలు అడ్డుగా ఉండటంతో మలుపు వద్ద ముందు వెళ్లే వాహనాలు, ఎదురుగా వచ్చే కనిపించడంలేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. అలాగే కల్లుదేవకుంట గ్రామ శివారులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని వంక సమీపంలోని మలుపు వద్ద కుడా ముళ్ల పొదలు అధికంగా పెరిగి రోడ్డుకు అడ్డంగా వచ్చాయి. సంబంధిత అధికారులు మలుపుల వద్ద ఉన్న ముళ్ల పొదలను తొలగించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.